www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 31 | డిసెంబర్ | 2025
పేజీలు : 8

## సిపిఐ వందేండ్ల వేడుకను జయప్రదం చేయండి



- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

2 లో

# వైకుంఠ రామా పాహిమామ్

## నేత్రపర్వంగా ఉత్తర ద్వార దర్శనం




ప్రజాపక్షం/భద్రాచలం : వైకుంఠ రామా పాహిమామ్... పాహిమామ్ అంటూ భక్తుల జయజయధ్వనాల నడుమ శ్రీ సీతారామ చంద్ర స్వామివారు మహావిష్ణువు అవతారంలో భక్తులు సాక్షాత్కరించారు. ముక్కోటి ఏకాదశి మిగతా 2లో..

- మహావిష్ణువు అవతారంలో సాక్షాత్కరించిన శ్రీరాముడు
- భారీగా తరలివచ్చిన భక్త జనం
- వైభవంగా స్వామికి తిరువీధి సేవ

## భూ పోరాట కేంద్రంగా ఖమ్మం

-పోరాటానికి తలవంచిన అప్పటి ప్రభుత్వం
-సిపిఐ వందేళ్ల ప్రస్థానం

ప్రజాపక్షం/ఖమ్మం : వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాట విజయాలను సాధించింది. అనేక మహత్తర పోరాటాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన పోరాటం ఒకటి. 1970 దశకంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి భూ పోరాటాలకు పిలుపునిచ్చింది. ఆ పిలుపును అందుకుని అప్పటి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన భూ పోరాటాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ బంజర భూములను అక్రమించి సాగు చేయడంతో పాటు పోడు నరికి సాగు చేయడం ప్రారంభించారు. కొణిజర్ల, ఇల్లందు, భద్రాచలం, అశ్వాపురం మండలాల్లో చారిత్రిక పోరాటాలు జరిగాయి. పోడు నరికిన రైతులతో గ్రామాలను నిర్మించారు. గణేశ్వరంలో జరిగిన భూ పోరాట సదస్సుకు అప్పటి జాతీయ కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు హాజరయ్యారు. భూ పోరాటంలో పాల్గొన్న భూమి లేని పేదలతో పాటు సిపిఐ నాయకులను అరెస్టు చేసి జైళ్లకు పంపారు. వేలాది మందిని జైళ్లకు తరలించినా భూ పోరాటాలు ఆగలేదు. భూ పోరాట నేపథ్యంలో రెండు ప్రధాన ఘట్టాలు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

### తోటపల్లి ఘటనతో ఉలిక్కిపడిన అధికారులు...

భద్రాచలం మండలం తోటపల్లి గ్రామంలో జరిగిన ఘటన అధికార యంత్రాంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. సిపిఐ నేతృత్వంలో పోడు భూమిని నరికి రైతులు సాగు చేశారు. అది చూసిన అటవీశాఖాధికారులు, పోలీసులు ఆయుధాలతో గ్రామంపై పడి భయోత్పాతం సృష్టించారు. అధికారుల తీరు శృతిమించడంతో గిరిజనులు మిగతా 2లో..

## మున్సి‘పోల్’కు కసరత్తు..!

-కొత్తగా ఏదులాపురం, కల్లూరు, అశ్వారావుపేట మున్సిపాలిటీలు
-కొత్తగూడెం స్థానే పాల్వంచతో కలిపి కార్పోరేషన్
-వార్డుల విభజన ప్రక్రియలో అధికారులు
-ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం




ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను జరిపేందుకు సిద్ధమవుతుంది. మున్సిపల్ ఎన్నికలతో పాటు హైదరాబాద్ మినహా మిగిలిన కార్పోరేషన్లకు కూడా ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో రాష్ట ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ ఆలోచన ప్రకారం ఎన్నికలు జరిగితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాత మున్సిపాల్టిలైన మధిర, వైరా, సత్తుపల్లి, ఇల్లందు తో పాటు కొత్తగా ఏర్పాటైన ఏదులాపురం, కల్లూరు, అశ్వారావుపేట మిగతా 2లో..





స్వాతంత్ర్య సమర యోధురాలు
W/o చావా వెంకటేశ్వరరావు(లేటు)

అశ్రునివాళి
ఆప్యాయతానురాగాలతో,
మంచితనానికి మారుపేరుగా నిలిచి,
చెరగని చిరునవ్వుతో
నలుగురికి ఆదర్శవంతురాలువై
మా అందరి హృదయాలలో
చిరస్థాయిగా నిలిచావు..
దివికేగిన నీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు :
చావా వేణు
డిసిసిబి మాజీ డైరెక్టర్
కొక్కిరేణి, తిరుమలాయపాలెం మం॥
ఖమ్మం జిల్లా.

పెద్దకర్మ : 31-12-2025 బుధవారం మా స్వగృహం కొక్కిరేణి గ్రామంలో జరుగును.

# వైకుంఠ రామా పాహిమామ్

(మొదటిపేజీ తరువాయి)
పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం భద్రాచలం రామాలయం ఆధ్వర్యంలో జరిపిన వేడుక నేత్రపర్వంగా సాగింది. సీతారామ చంద్ర స్వామివారిని గర్భగుడిలో ప్రత్యేక అలంకారంలో తయారు చేసి రాజాధిరాజ వాహనంపై ఉత్తర మెట్ల ద్వారా ద్వారంలోనికి తీసుకొచ్చారు. రామదాసు కాలం నుండి కొనసాగుతున్న ఆచారం ప్రకారం రెవెన్యూ సేవను తహశీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని పీఠలపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాల సువాసనల, ధూప దీపల నడుమ స్వామికి అష్టోత్తర శతనామార్చనాలు జరిపించారు. రామాయణ పరాయణం, దివ్య ప్రంబంధ విన్నపాలు జరిగాయి. శరణాగతి నిర్వహించి గద్య, గరుడ దండకం, భక్తరామదాసు రచించిన దాశరధి శతకం పఠించారు. వైకుంఠ రామునికి 108 ఒత్తులతో కూడిన హారతి పట్టారు. ఉత్తర ద్వారాం ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు జై శ్రీరామ్, పాహిమామ్ అంటూ చేసిన రామనామ సంకీర్తనలు భూలోక వైకుంఠాన్ని తలపించాయి. ఈ వేడుకను కనులారా చూసేందుకు పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు ముందుగానే భద్రాచంల చేరుకున్నారు. తెల్లవారు ఝామునే వైకుంఠ ద్వారా వద్దకు చేరుకున్న పలువురు స్వామివారి ప్రసన్నత కోసం వేయి కళ్లతో ఎదురు చూసారు. స్వామి సాక్షాత్కారం కావడంతో








సర్గలోక ప్రాప్తి లభించినంత ఆనందానుభూతిని పొందారు.

**ఘనంగా తిరువీధి సేవ...**

ఉత్తర ద్వార దర్శన కార్యక్రమం ముగిసిన పిపద వైకుంఠ రాముని సేవ ఘనంగా జరిగింది. చలువచప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై ఆండాళ్ అమ్మవారు, గరుడ వాహనంపై శ్రీరామ చంద్ర మూర్తులు, గజవాహనంపై సీతమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మ ణస్వామి ఆశీనులు కాగా మేళ తాళాల నడుమ తిరువీధి సేవ శోభాయమానంగా సాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, దేవస్థానం ఇఓ దామోదరరావు చర్యలు తీసుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో, ఏఎస్‌పి నేతృత్వంలో సాగాయి. ఈ వేడుకకు భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకటరావు, భద్రాచలం గ్రామ పంచాయితీ సర్పంచ్ పూనెం కృష్ణ దొర, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట, ఐటిడిఏ పిఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# భూ పోరాట కేంద్రంగా ఖమ్మం

**(మొదటిపేజీ తరువాయి)** అధికార యంత్రాంగానికి ఎదురు తిరిగారు. పోలీసుల హింసాత్మక చర్యలకు ఎదురు తిరిగి ఆయుధాలను గుంజుకున్నారు. గిరిజనులు ఎదురు తిరగడంతో అధికారులు పరారయ్యారు. గిరిజనులు ఆయుధాలను గుంజుకుని పోడు నరికిన భూముల్లోనే దాచిపెట్టారు. ఈ ఘటనకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అప్పటి సిపిఐ జిల్లా కార్యదర్శి పువ్వాడ నాగేశ్వరరావును సంప్రదించారు. పువ్వాడ సానుకూలంగా స్పందించి వెంటనే తోటపల్లి వెళ్లి గిరిజనులతో చర్చించి ఆయుధాలను తిరిగి అప్పగించే ఏర్పాటు చేశారు. ఆయుధాలను గుంజుకుని పరారయ్యారన్న అప్పటి వార్త రాష్ట్రంలో సంచలనం సృష్టించగా పార్టీ తీసుకున్న వైఖరి, ఆయుధాల అప్పగింత పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేసింది.

**దిగివచ్చిన ప్రభుత్వం...**

సిపిఐ భూ పోరాటాలతో అప్పటి ప్రభుత్వం దిగివచ్చింది. గణేశ్వరం, వినోభానగర్, తోటపల్లి, మల్లెమడుగు తదితర పోరాటాలలో వేలాది మందిని జైళ్లకు పంపారు. జైళ్లలో కొంత మంది ఉండగానే ఇక్కడ భూ పోరాటాలు ఉధృతంగా కొనసాగుతుండటంతో ప్రభుత్వం ఆలోచనలో పడింది. మరో పక్క రాజమండ్రి, వరంగల్, ముషీరాబాద్ జైళ్లు నిండిపోయాయి. అప్పుడు ప్రభుత్వం నిర్బంధంతో భూ పోరాటాలను నిలువరించలేమని సిపిఐని చర్చలకు ఆహ్వానించింది. సిపిఐ నేత గిరిప్రసాద్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతో చర్చలు జరిపింది. అప్పటి వరకు స్వాధీనం చేసుకున్న, పోడు నరికిన భూములను పేదలకు అప్పగించడమే గాక పట్టాలు ఇచ్చేందుకు అంగీకరించింది. ఇది దేశ చరిత్రలోనే అద్భుత పోరాట విజయం. జైళ్లు, నిర్బంధాలు లెక్కచేయక పేదలు సాగించిన పోరాటం ప్రభుత్వం దిగివచ్చేలా చేసింది. ఈ భూ పోరాటానికి నేతృత్వం వహించిన అమరులకు శతాబ్ది ఉత్సవ ముగింపు సభ సందర్భంగా నివాళులర్పిస్తూ....

## సిపిఐ వందేండ్ల వేడుకను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహించనున్న సిపిఐ వందేళ్ల వేడుకను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం గ్రామంలో శాఖ జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 26న నిర్వహించాల్సిన వేడుకలు వాయిదా పడ్డాయన్నారు. కావున నిర్వహించబోయే వేడుకలకు సిపిఐ శ్రేణులు ఊరురా ముమ్మర ప్రచారం చేయాలని సూచించారు. అలాగే ఈ వేడుకలో భాగంగా సుదీర్ఘకాలంలో సిపిఐ చేసిన పోరాటాలు, సాధించిన హక్కులను నేటి తరానికి చాటి చెప్పాలన్నారు. ఇతర దేశాల నుంచి కమ్యూనిస్టు నేతలు హాజరుకాబోతున్నారని, ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఉండబోతుందన్నారు. ఈ వేడుకను చూసే అవకాశం మరాల 100సంవత్సరాల తర్వాతే వస్తుందన్నారు. అటువంటి వేడుకను చేసే భాగ్యం మనకు కలగడం అదృష్టంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పగీళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ సర్పంచ్ చూండురి సృజన, సిపిఐ గ్రామ నాయకులు పెండ్లి నర్సిరెడ్డి, కళ్లెం ముత్తయ్య, కళ్లెం సీతయ్య, కళ్లెం వీరయ్య, కొమరబత్తిని వెంకటరత్నం, అన్నమ్మ, దారుమల్ల నాగయ్య, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# మున్సి ‘పోల్’కు కసరత్తు..!

(మొదటిపేజీ తరువాయి)
మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగూడెం మున్సిపాలిటీ స్థానే పాల్వంచ, సుజాత నగర్ కలిపి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం విధితమే. 60 డివిజన్లతో ఏర్పాటైన ఈ కార్పోరేషన్‌కు కూడా ఫిబ్రవరి మాసంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేసింది. మున్సిపల్ అధికారులు వార్డుల వారీగా కసరత్తు ప్రారంభించారు. మున్సిపాలిటీలోని మొత్తం ఓటర్లు కుడి ఎడంగా ఆయా వార్డులకు విభజించే ప్రక్రియను చేపట్టారు. మధిర, వైరా, ఇల్లందులో వార్డుల సంఖ్య గతం కంటే పెరగవచ్చునని భావిస్తున్నారు.

**కొత్త మున్సిపాలిటీలు :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మూడు మున్సిపాలిటీలలో ఏదులాపురం మున్సిపాలిటీని 32 డివిజన్లతో ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీ పరిధిలో అన్ని గ్రామాలే ఉండటం కొంత పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో వార్డుల కసరత్తు సులభంగానే జరిగిపోయింది. ఏదులాపురం మున్సిపాలిటీ అధికారులు వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసినట్లు సమాచారం. కొత్తగా ఏర్పాటైన కల్లూరు మున్సిపాలిటీలో కల్లూరు పట్టణంతో పాటు చుట్టూ ఉన్న కొన్ని గ్రామ పంచాయతీలను కల్లూరు మున్సిపాలిటీలో విలీనం చేశారు. అశ్వారావుపేట పట్టణంతో పాటు కొన్ని గ్రామ పంచాయతీలను విలీనం చేశారు.

**కార్పోరేషన్‌గా కొత్తగూడెం :**

ఖమ్మం కొత్తగూడెం మున్సిపాలిటీని స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చొరవతో విశాల లక్ష్యంతో కార్పోరేషన్‌గా ఏర్పాటు చేశారు. కొత్తగూడెం పట్టణంతో పాటు పాల్వంచ పట్టణం సుజాతనగర్, లక్ష్మి దేవిపల్లి మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలను కలుపుతూ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేశారు. కార్పోరేషన్‌ను 60 డివిజన్లుగా విభజించనున్నారు. వీటితో పాటు పాత మున్సిపాలిటీలైన సత్తుపల్లి, ఇల్లందు, మధిర, వైరా మున్సిపాలిటీల్లో కూడా రెండు నుంచి నాలుగు వార్డుల చొప్పున పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది.

**రాజకీయ పార్టీల సన్నాహం...**

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించడంతో రాజకీయ పార్టీలు సన్నాహాలు ప్రారంభించాయి. ఆయా మున్సిపాలిటీల పరిధిలో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసి పోటీకి సన్నాహాలు ప్రారంభించాయి. అధికార కాంగ్రెస్ తో పాటు విపక్ష బిజెపి, సిపిఐ, సిపిఎంలు మున్సిపల్ ఎన్నికలపై దృష్టిసారించాయి. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ డివిజన్ల వారీగా బరిలో నిలిపే అభ్యర్థుల కోసం రాజకీయ పార్టీలు వేట ప్రారంభించాయి. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి.

## పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ





**ప్రజాపక్షం/బోనకల్/ఖమ్మం వైద్యవిభాగం:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చందు నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ క్లినిక్ జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ద్వారా సద్వినియోగించుకుంటున్న మహిళల సంఖ్య, సంబంధిత రికార్డులను పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలో ఎన్‌సిడి వ్యాధుల స్క్రీనింగ్ గురించి గర్భిణీ స్త్రీల నమోదు, సాధారణ పిహెచ్‌సి కాన్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్‌సిలో పరీక్షల కొరకు వచ్చిన గర్భిణీ స్త్రీలతో మాట్లాడారు. గర్భిణీలను, విధులను పర్యవేక్షిస్తున్న ఆశలతో లెప్రోసి సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో స్వీపరు పోస్ట్‌ను భర్తీ చేసే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా,వేరొక పిహెచ్‌సి నుంచి సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఎన్‌సిడి స్క్రీనింగ్‌ను పెంచాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు నమోదు అయిన వెంటనే సికిల్ సెల్, సికిల్ సెల్ డిసీస్ కొరకు స్క్రీనింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి స్రవంతి, డాక్టర్ వి కావ్య, హెచ్‌ఈఈఓ రవి, డిఎంఅండ్‌హెచ్‌ఓ అఫీస్ సిబ్బంది ఐఎల్‌ఆర్ రామకృష్ణ, డిఐఓ అనూష, నర్సింగ్ ఆఫీసర్లు రమాదేవి, ఫార్మసిస్టు రాధాలత తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/చింతకాని :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బస్వాపురం గ్రామంలో శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు బస్వాపురం నుంచి అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గ్రామల్లో ప్రచార జాతా వచ్చినపుడు ప్రతి కార్యకర్త కదలిరావాలన్నారు. ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, పార్టీ మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, బద్దల పెద్ద వెంకటి, సైదులు, మామిడాల వేల్పాద్రి, చంద్రకాని రామ్మూర్తి, ఆవుల మన్మధరావు, శ్రీను, మార్గం శ్రీను, లక్ష్మీ నారాయణ, వెంకటేష్, లక్ష్మీ నారాయణ , ఉమామహేశ్వరరావు, రాజు, తిరుపతిరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై ఆర్థికభారం మోపవద్దు

**-కమిషనర్‌కు బిఆర్ఎస్ కార్పొరేటర్ల వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ప్రజలపై ఆస్తి పన్నుకు సంబంధించి ఆర్థిక భారాలు మోపవద్దని కోరుతూ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కార్పొరేటర్లు ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం ఖమ్మం కార్పోరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మగ్బూల్, పలువురు కార్పొరేటర్లు కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి పలు అంశాలకు సంబంధించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో సామాన్య ప్రజలపై ఆస్తి పన్ను, యుఎసి పెనాల్టీలు, సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్ ప్రాంతాలపై అక్రమంగా విధిస్తున్న పన్నుల వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేవలం పార్కింగ్ అవసరాల కోసం ఉపయోగిస్తున్న సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్‌లపై ఆస్తి పన్ను విధించడం మున్సిపల్ చట్టాలకు విరుద్ధమన్నారు. 2013 సెప్టెంబర్ ఒకటికి ముందు నిర్మించిన భవనాలపై యుఏసి పెనాల్టీ శూన్యంగా పరిగణించాల్సి ఉండగా ప్రైవేటు ఏజెన్సీల సర్వే పేరుతో ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నారన్నారు. ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) పొందిన భవనాలపై కూడా 50 శాతం యుఏసి పెనాల్టీ విధించడం అన్యాయమన్నారు. జీవో నెం. 58 క్రింద గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్దిదారులు, ఇందిరమ్మ గృహాల లబ్దిదారులు ఇంటి నెంబర్లు, మ్యూటేషన్, విద్యుత్ మీటర్ల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ పథకం లబ్దిదారుల జాబితా, స్థితిగతులకు సంబంధించి కార్పొరేటర్లకు అధికారికంగా వివరాలు అందజేయాలని కోరారు. ప్రజలపై అనవసరంగా ఆర్థిక భారం మోపకుండా నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించాలని తద్వారా కార్పోరేషన్‌కు ఆదాయం కూడా పెరుగుతుందని కార్పొరేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు నాగండ్ల కోటేశ్వరరావు, వలరాజు, రాంమోహన్‌రావు, నాయకులు వీరభద్రం, జశ్వంత్, మాటేటి నాగేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల కుక్‌లకు వంటల పోటీలు

**-వివిపాలెం కుక్‌కు మొదటి బహుమతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో (మధ్యాహ్న భోజన పథకం) కుక్‌లకు వంటల పోటీలను నిర్వహించారు. పిఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి వంటల పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన కుక్‌లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రఘునాథపాలెం, బోనకల్, ఏన్కూరు, వైరా, నేలకొండపల్లి, ఖమ్మం అర్బన్ మండలాల్లో వంట కార్మికులు, సహాయకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు గాను అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలు (కుక్) గా పనిచేస్తున్న చిర్రా లింగమ్మ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆమె వెజిటబుల్ బిర్యాని, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రి, పెరుగుచట్నీ తయారు చేశారు. బోనకల్ మండలం ముష్టికుంట్లకు ద్వితీయ స్థానం, ఏన్కూరు మండలం బిఆర్‌పురం కుక్ తృతీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో శైలజలక్ష్మి , సిఎంవో ప్రవీణ్, రిటైర్డ్ హెచ్ఎం వేమిశెట్టి మోహన్‌దాస్, మామిళ్లగూడెం హెచ్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

**-విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి**
**-సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆర్‌టిసిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులను డిపో మేనేజర్ ఊటుకూరి సునిత మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకునే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు. ఉద్యోగులు కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేయాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ ఎక్కువ ఆదాయం తెచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.సత్తుపల్లి డిపోలో నవంబర్ 2025లో అత్యధిక ఆదాయం, అత్యధిక కే ఎం పి ఎల్ తెచ్చిన వారిని ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో డి. యాదగిరి, ఎం నరేంద్ర, కే సైదులు.టీ.గోపి,టి.వి. రావు,పి. వి.సుబ్బారావు, డ్రైవర్ విభాగంలో వి.వి. రమణ, పి. రాజేష్, ఎస్వి రావు, వి హనుమంతరావు, కే నరేష్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఏడీసీలు పి .అప్పారావు, బాల రావు, బాల స్వామి, కృష్ణారెడ్డి, కాంతారావు,కుద్దూస్, కిరణ్ బాబు వెంకటయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతవాతావరణంలో నూతన వేడుకలు జరుపుకోవాలి : సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని పేర్కొన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. రోడ్డుప్రమాదాలకు గురై దుర్ఘటన పాలైతే నూతన వేడుకల్లో కుటుంబాల్లో విషాదం నింపవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా యువత ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ప్రమాదాల భారీన పడవద్దని పేర్కొన్నారు. గుంపుల గుంపులుగా రోడ్లపై తిరగడం నిషేధమన్నారు. నిర్ణిత నిమయంలో మద్యం దుకాణాలు మూసివేయాలని నిర్వహకులకు సూచించారు. వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతూ కేరింతలు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని యువతను, ఆకతాయిలను హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్నేహపూర్వక వాతవరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలన్నారు. మహిళల భద్రతలకు షీటీం బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీం, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. డీజేలకు అనుమతిలేదన్నారు. బార్లు, వైన్స్ నిర్ణత సమయంలోపు మూసివేయాలన్నారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెస్టారెంట్లు, షాపులు పరిసరప్రాంతాల్లోని సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని విజువల్ రికార్డుఅయ్యేలా చూసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. మైనర్లకు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానితో పాటు తల్లితండ్రులను బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లు ముమ్మరంగా చేపట్టనున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో బైక్‌రేసులు, అతివేగంగా వాహనాలు నడపకుండా పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేసినట్లు పోలీసుకమిషనర్ తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకే..




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శుభాకాంక్షల పేరుతో యువత అతిఉత్సాహం ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు జైలుకు పంపుతామని ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రశాంతవాతవరణంలో సంబరాలు జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి పెద్దపెద్ద శబ్దాలు, కేరింతలు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవిధంగా బైక్‌పై విన్యాసాలు చేస్తే వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఖమ్మం నగరం వ్యాప్తాంగా అన్ని ప్రధాన కూడళ్లల్లో డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహిసున్నామన్నారు. మద్యం సేవించి దొరికితే కేసులు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపుతామన్నారు. మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఆనందం కోసం ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. షాపింగ్, ఇతర ఈవేంట్లకు వెళ్లినప్పుడు పోలీసువారి సూచనలు పాటిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# జర్మన్ భాష శిక్షణ, ఉద్యోగం కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జర్మన్ భాష శిక్షణ అందించి అక్కడ పేరొందిన ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం అర్హులైన నర్సుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక, ఉపాధి శిక్షణ కార్మాగారాల శాఖ క్రింద రిజిస్టరైన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో అర్హత కలిగిన నర్సులకు ఉచితంగా జర్మన్ భాష శిక్షణ అందించి అక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జర్మన్ భాష శిక్షణ ఎన్‌రోల్ మెంట్ ప్రోగ్రాం కోసం దరఖాస్తు చేసుకోవాలని, బియస్సి లేదా జిఎన్ఎం కోర్సు పూర్తి చేసి 22 నుంచి 38 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు, ఒక సంవత్సరం క్లినికల్ పనిచేసిన అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బిఎన్ స్థాయి వరకు భాషా శిక్షణ అందించి, విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత జర్మనీలో స్టాఫ్ నర్సుగా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. నెలకు రూ.2.5 లక్షల నుంచి మూడు లక్షల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు, నమోదు కోసం 9440051581 నెంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు.

# ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర దంపతులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని తెల్లవారుజామున బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దంపతులు స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనంలో దర్శించుకున్నారు. ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను సండ్ర దంపతులకు అందజేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఏటా తిరుమల శ్రీవారిని వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శించుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందని సండ్ర తెలిపారు.

## తిప్పనపల్లి రేషన్ దుకాణం సీజ్



ప్రజాపక్షం/చండ్రుగొండ: చండ్రుగొండ మండలం తిప్పనపల్లి రేషన్ దుకాణాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారులు సీజ్ చేసినట్లు సివిల్ సప్లై ఆర్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 28న రేషన్ షాప్ తనిఖీలో భాగంగా సివిల్ సప్లై అధికారులు చండ్రుగొండ, తిప్పనపల్లి రేషన్ షాపులను తనిఖీ చేయగా రేషన్ డీలర్లు అందుబాటులో లేరు. తిప్పనపల్లి రేషన్ షాప్‌లో 21 క్వింటాళ్ల బియ్యం లెక్కల్లో తేడా వచ్చినట్లు ఆర్ఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. దీంతో ఈ షాప్‌ను సీజ్ చేసి పక్క రేషన్ షాప్ డీలర్ బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు.

## లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తప్పవు

**-వ్యవసాయ మార్కెట్ శాఖ కార్యదర్శి నరేష్**



ప్రజాపక్షం/ఇల్లందు: మార్కెట్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు చేపడతామని మార్కెట్ శాఖ కార్యదర్శి నరేష్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కరెంట్ ఆఫీస్, సుదిమల్ల, రొంపేడు ఏరియాలలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టి ఫైన్లు విధించారు. మార్కెట్ ఫీజు 16,800 ఫైన్ 10,000 రూపాయలు పలువురికి విధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారస్తులు తప్పకుండా ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని సూచించారు. అక్రమ వ్యాపారాన్ని అరికట్టి మార్కెట్ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ దాడుల్లో మార్కెట్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్‌యు రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయండి




ప్రజాపక్షం/ఇల్లందు: వరంగల్ కేంద్రంలో జనవరి 5,6,7వ తేదీల్లో జరగబోయే పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇల్లందు కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా పిడిఎస్‌యు జిల్లా నాయకులు గణేష్ పాల్గొని మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన పిడిఎస్‌యు 23వ మహాసభలను వరంగల్ కేంద్రంలో జరుపుకోబోతుందని, జార్జిరెడ్డి ప్రేరణతో, జెసిఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పడిన పిడిఎస్‌యు ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా అనేక విద్యార్థి ఉద్యమాలు నిర్వహించిందని, శాస్త్రీయ విద్య సాధన, సమ సమాజ స్థాపక లక్ష్యంగా ముందుకు సాగిందన్నారు. విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ విద్యార్థి లోకం పోరాటానికి సిద్ధం కావాల్సిన సందర్భంగా మన ముందు ఉంటుందన్నారు. ఇట్లాంటి ప్రత్యేక సందర్భంలో పిడిఎస్‌యు మహాసభలను జరుపుకోబోతున్నదని, విద్యార్థి లోకం అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో లక్ష్మి నరసింహ, అఖిల్, రామ్‌చరణ్, ఆయుష్, గంగోత్రి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మంపేట పంచాయితీ భవన అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామ పంచాయితీ కార్యాలయ అదనపు గదుల నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ తుర్రం శ్రీనివాస్ ఘనంగా శంకుస్థాపన చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామ పంచాయితీకి నూతన పాలకవర్గం ఎన్నికైన తర్వాత చేపట్టిన మొదటి అధికారిక కార్యక్రమం ఇదే కావడం విశేషం. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పంచాయితీ భవనం పాతది కావడంతో పాటు, రికార్డులు భద్రపరుచుకోవడానికి తగినన్ని స్టోర్ రూమ్‌లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తు అవసరాలను, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయినాథ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు, వివిధ వార్డుల సభ్యులు, పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**-స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు**
**-తెల్లవారుజాము నుండే క్యూ లైన్లలో భక్తులు**





ప్రజాపక్షం/సత్తుపల్లి: ముక్కోటి ఏకాదశి వేడుకలు పట్టణ, మండల పరిధిలోని ఆయా దేవాలయాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. దేవాలయాలు తెల్లవారు జాము నుండే భక్తులతో కిటి,కిటలాడాయి.పట్టణంలోని రామాలయంలో క్యూలైన్లు భక్తులతో కిట,కిటలాడింది. స్వామి వారి దర్శనానికి భారీగా భక్తులు రావటం, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా దేవాలయ కమిటి సకల ఏర్పాట్లు చేశారు. శేషతల్పం మీద శయనించే విష్ణుమూర్తిని దర్శించుకోడానికి వైకుంఠానికి తరలివెళ్లే ముక్కోటి దేవతలతో కలిసి స్వామి భూలోకానికి వచ్చే శుభ సందర్భమే వైకుంఠ ఏకాదశని, పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటే జన్మ జన్మల పాపాలు తొలగిపోయి పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయని ప్రతీతి. ముక్కోటి ఏకాదశి రోజు విష్ణుదర్శనం తర్వాత పూజచేసి ఉపవాసం ఉంటే అఖండ ఐశ్వర్యం సిద్ధిస్తుందంటారు.ఈ రోజు శ్రీ మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సరిసమానమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని అర్చకులు తెలిపారు.

# సింగరేణి మనుగడకు రాజీలేని పోరాటం

**- కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం**
**- గుర్తింపు సంఘ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి మనుగడ కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా గుర్తింపు సంఘం ముందుకు సాగుతుందని ఏఐటియూసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు సంఘం)ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. కొత్తగూడెం ఏరియా పిసికె 5 ఇంక్లైన్ గేట్‌మీటింగ్ మంగళవారం జరిగింది. ఫిట్ కార్యదర్శి హుమాయూన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొరిమి మాట్లాడుతూ సంస్థ ద్వారా నూతన బొగ్గు బ్లాకులను తీసుకొచ్చి సింగరేణి మనుగడను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేసే ప్రతీ కార్మికుడికి 30 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలన్నారు. యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. అదే విధంగా సంస్థ ప్రైవేటు పరం కాకుండా కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సమ్మెకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. క్వాలిటీ వచ్చే పికే ఓసి డిపైన్స్‌డ్ బ్లాక్‌ను వేలం లో పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సోమవారం జరిగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఏఐటియూసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు కార్మికుల సమస్యల పరిష్కారానికి మాట్లాడారని అన్నారు. సింగరేణి స్థితిగతులు, కార్మికుల సమస్యలపై ఎప్పుడూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, నాయకులు ఎస్ నాగేశ్వరరావు, కమల్, సాయి, పవన్, భూక్య రమేష్, రామచందర్, క్రాంతి,రమణ, ఆకుల శ్రీనివాస్, సుమన్ మదనయ్య, ఇరప కృష్ణ, ధర్మ, శేషయ్య, దేవసింగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**-టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు**



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఆశ్రమ హైస్కూల్ మర్కోడు నందు జరిగిన మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు బానోత్ భోజ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఈసం ముత్తయ్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని, పండిట్, పిఈటీలకు అప్‌గ్రేడ్షన్ చేయాలని, సిఆర్‌టిలకు, డైలీ వర్కర్లకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థకు మూల స్తంభాలైన సిఆర్‌టిలు ఏళ్ల తరబడి సేవలందిస్తున్నప్పటికి వీరికి తగిన ప్రయోజనాలు కలగకపోవడం తీవ్ర అన్యాయం, ఇది గిరిజన విద్యాభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. కావున ప్రభుత్వం సమస్యలను సానుకూలంగా పరిగణించి తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు తీసుకొని ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధంగా ఉంటామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో టిఎస్‌టిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ నరేష్, ఉపాధ్యాయులు బి బాలు, భద్రు, ఈసం రవీందర్ బాబు, బి రవి కుమార్, యం లక్ష్మయ్య, బాల కృష్ణ, సోమేశ్వర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్తయిన ఎంపీడీవో కార్యాలయం కాంప్లెక్స్ టెండర్లు

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి ఎంపీడీవో కార్యాలయం పరిధిలోని ఐదు కమర్షియల్ గదులకు నిర్వహించిన సీక్రెట్ ఆక్షన్ విధానం మంగళవారం పూర్తయింది. 1వ నెంబర్ గది రూ.15,340, 2వ నెంబర్ గది రూ. 8,600, 3వ నెంబర్ గది రూ. 13,500, 4వ నెంబర్ రూమ్ రూ. 15,5,55,94, 5వ నెంబర్ గది రూ. 16,6,66 చొప్పున లభించాయి. గదులు దక్కించుకున్న వ్యక్తులకు ఎంపీడీవో నాగేశ్వరరావు హెచ్చరికలు జారీ చేశారు. ఆక్షన్ లో పొందిన గదులు వేరే వ్యక్తులకు ఇస్తే రద్దు చేసి తిరిగి ఆక్షన్ పెడతామని పేర్కొన్నారు..

# వైరా మున్సిపాలిటీలో పట్టు ఎవరిది?

**-మున్సిపాలిటీలో పాగా వేసేందుకు పార్టీలు ఎత్తులు**
**-క్యాడర్ చెదరకుండా ఉండేందుకు ప్రయత్నాలు**
**-పోటీకి సై అంటున్న పలువురు ఆశావాహులు**
**-మున్సిపాలిటీలో యువత జోష్**






ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో మున్సిపాల్ ఎన్నికలు జరగనున్న నేపద్యంలో రాజకీయ పార్టీల్లో వేడి వాతావరణం నెలకొంది. ఇప్పటి నుండే మున్సిపాలిటీలో పట్టు సాధించేందుకు ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మున్సిపాల్ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో రానుంది అన్న నేపద్యంలో రాజకీయ పార్టీలు ఎవరికి వారే పాగా వేసేందుకు ఎత్తులపై ఎత్తులు వేస్తున్నాయి. ఎవరికి వారే నాయకులు వారి అనుచరులను కాపాడుకునేందుకు జోరుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు వార్డుల్లో పోటీ చేసేందుకు సై అంటే సై అంటున్నారు. అయితే రిజర్వేషన్లు మరతాయా లేదా పాత పద్ధతిలోనే ఎన్నికలు జరుగుతాయని దానిపై కూడా రాజకీయ పార్టీలు తర్జనభర్జన పడుతున్నాయి. జనవరిలో పురపాలక పదవి కాలం అయిపోవడం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు కేటాయించడం జరిగింది. ఇప్పుడు మరల పురపాలక ఎన్నికలు జరగనున్న నేపద్యంలో ఒక్కసారిగా వైరాలో రాజకీయ వాతావరణ వేడెక్కుతుంది. అయితే ఈ ఎన్నికల్లో ఎవరికి వారి పై చేయి సాధించేందుకు పావులు కదుపుతున్నారనే వాదన సైతం వినిపిస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. ఇదే క్రమంలో బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం, బిజెపి పార్టీలు కూడా మున్సిపాల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సై అంటున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకుంటారో ఎవరు ఏ పార్టీతో ఉంటారో అనేది కూడా ఒక క్లారిటీ లేదు. రిజర్వేషన్లు మారుతాయనే నేపద్యంలో జనరల్ బిసి స్థానాలపై ఆశలు పెట్టుకున్న కొందరు నేతలు ఇప్పటికే రహస్యంగా వార్డుల్లో ముఖ్య నేతలతో సమావేశాలు పార్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. వైరా మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో రిజర్వేషన్లు మారుతాయా మారవా అనే దానిపై కూడా స్పష్టత లేక తర్జనభర్జన పడుతున్నారు. వార్డులు రిజర్వేషన్ మారితే ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలి ఏఏ పార్టీ నుంచి పోటీ చేయాలి అనే దానిపై లోతుగా చర్చిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఎవరికి టిక్కెట్లు వస్తాయి అనే దానిపై నేతల్లో టెన్షన్ నెలకొంది. వైరా మున్సిపాలిటీలో ఎవరిది పై చేయి అనేది కూడా ఈ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్ధారించనున్నాయి. ఇప్పటికే బలమైన క్యాడర్ ఓ నాయకుడు కలిగి ఉన్నాడనే వాదనలు సైతం వినిపిస్తున్నాయి. వైరా మున్సిపాలిటీలో ఆ నాయకుడు కనుసైగల్లోనే పెద్ద ఎత్తున క్యాడర్ పనిచేస్తుందని వాదనలు సైతం వినిపిస్తున్నాయి. మారుతున్న రాజకీయ పరిణామాలు నేపద్యంలో ఎవరు ఏ పార్టీతో ఉంటారు అనేది కొంతమంది నాయకులను వెంటాడుతున్న సమస్య. వైరా మున్సిపాలిటీలో ఈసారి పెద్ద ఎత్తున ఇండిపెండెంట్‌లు కూడా పోటీలో దిగుతారనే వాదనలు వినిపిస్తున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు మున్సిపాల్ ఎన్నికల్లో ఏ పార్టీకి సంబంధం లేకుండా పోటీ చేయాలనే ఆలోచన ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రజలను దగ్గర చేసుకునే ప్రయత్నం చేశారని వాదనలు లేకపోలేదు. అధికార కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. కంగ్రెస్ పార్టీ ఏ విధంగా వినియోగించుకుంటుందో అనే దానిపై కూడా జోరుగా చర్చ కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీలో కీలకమైన పదవీ బాధ్యతలు ఉన్న నాయకులు రాష్ట్రస్థాయి నాయకులు వైరాలో ఉన్నారు. నాయకులు సారధ్యంలో ఎలాంటి ఫలితాలు రాబోతున్నాయి. ఎవరు పైసలు సాధిస్తారు అనేది కూడా చర్చనీయాంశంగా మారుతుంది. బిఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయినప్పటికి క్యాడర్‌లో గట్టి పట్టుదల ఉంది. ఇప్పటికే సిపిఎం, బిఆర్ఎస్ పొత్తు బలపడినప్పటికీ పొత్తుతోనే మున్సిపాల్ బరిలో పోటీ చేస్తారా స్వతంత్రంగా పోటీ చేస్తారనేది కూడా తెలియాల్సి ఉంది. మరోపక్క తెలుగుదేశం పార్టీ ఎవరితో పొత్తుల పోటీ చేస్తుంది అనేదానిపై కూడా సందిగ్ధత నెలకొంది. అదేవిధంగా వైరా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున యువకులు మున్సిపాల్ బరిలో నిలిచేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీ ముఖ్య నాయకులు యువతకు ప్రాధాన్యత ఇస్తారా లేదా అనే దాపిపై కూడా జోరుగా చర్చ జరుగుతూ ఉంది. ఏది ఏమైనప్పటికీ వైరా మున్సిపాలిటీలో ఎన్నికలు జరిగితే ఆ ఎన్నికల్లో ఎవరి బలం ఏ విధంగా ఉందో ఎవరు పై చేయి సాధిస్తారో ఆ నాయకుడు ఎవరు అనేదానిపై ఫలితాలు అనంతరం తెలియనుంది.

# 'కంచె చేనుమేస్తే' కథనంపై కదిలిన జిల్లా యంత్రాంగం..!

**రేంజ్ కార్యాలయంలో కలపను పరిశీలించిన ఎఫ్డీఓ కోటేశ్వరరావు**






ప్రజాపక్షం/జూలూరుపాడు: రక్షించవలసిన కంచె చేను మేస్తే ఎలా అనే శీర్షికతో. సోమవారం ప్రజాపక్షం దినపత్రికలో వెలువడిన కథనంపై జిల్లా ఫారెస్ట్ అధికార యంత్రాంగం స్పందించింది. మండలకేంద్రంలోని ప్లాంటేషన్లో అర్ధరాత్రుల్లో చెట్లను అక్రమంగా నరికించి పాపకొల్లు గ్రామంలో బీట్ ఆఫీసర్ నరసింహారావు నివాసంలో నిల్వ ఉంచిన విషయం గ్రామస్థుల సమాచారం మేరకు కలప పట్టు బడ్డ విషయమై. ఫారెస్ట్ ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు ఎఫ్డీఓ కోటేశ్వరరావు సిబ్బందితో రేంజ్ కార్యాలయంలోని ప్లాంటేషన్ నుండి తీసుకువెళ్లిన దుంగలను మంగళవారం సందర్శించి, దుంగలను పరిశీలించి కొలతలు వేశారు.

**కలప రవాణాలో అధికారుల సహకారంపై ఆరా....**

మండలపరిధిలోని ప్లాంటేషన్ నుండి అక్రమ కలప రవాణా గ్రామస్తుల సమాచారంతో బీట్ ఆఫీసర్ ఇంట్లో కలప పట్టుబడటంతో మండలవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఇష్యూ లో ఫారెస్ట్ సిబ్బంది నివాసంలో కలప నిల్వ ఫారెస్ట్ సిబ్బంది సహకారాలుతోనే అక్రమ కలప రవాణా జరుగుతుందనే గ్రామస్తులు బహిరంగాను చర్చించు కోవడంతో. ప్రజాపక్షం దినపత్రిక ప్రచురించిన కథనంతో జిల్లా అధికారులు స్పందించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అక్రమ కలప రవాణాకు అధికారుల సహకారం విషయంలో సహకరించిందెవరు.? కొందరి అధికారుల వ్యవహారంపై సమగ్ర వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నత అధికారులు అక్రమ కలప రవాణా వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకుని బాధ్యులపై కఠినంగా వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఎఫ్డీఓ కోటేశ్వరరావు వివరణ....**

జూలూరుపాడు రేంజ్ పరిధిలోని బీట్ ఆఫీసర్ ప్లాంటేషన్ నుండి నరికిన కలపను రేంజ్ కార్యాలయంలో పరిశీలించిన అనంతరం ఎఫ్డీఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాంటేషన్ లోని ఎన్ని చెట్లను నరకారని పరిశీలించామని నారేప చెట్లను నరికిన దుంగల కొలతలు సేకరించామని నరికిన చెట్లకు జూలూరుపాడు రేంజ్ ఆఫీస్ వాళ్ళు నెంబర్లు వేసి నమోదు చేసారని, నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేయనుకున్నారని, ప్లాంటేషన్ లో నరికిన చెట్ల విలువ సుమారు 24వేల విలువ ఉంటుందని, సేకరించిన వివరాల నివేదికను ఉన్నత అధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు వుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పనులతో అభివృద్ధికి శ్రీకారం



ప్రజాపక్షం/బూర్గంపాడు: రామాలయ పనులతో గ్రామ పంచాయితీలో అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ఫట్టినట్లు సర్పంచ్ బోళ్ళ సైదమ్మ అన్నారు. మంగళవారం గ్రామంలోని రామాలయ ప్రహరీగోడ పనులను సర్పంచ్ బోళ్ళ సైదమ్మ, ఉప సర్పంచ్ ఇస్లావత్ రవిలు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయితీ పరిధిలోని కాలనీలలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. తమకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు గ్రామంలోని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీలకతీతంగా, రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్దే ధ్యేయంగా తమ పాలక మండలి పని చేస్తుందని పేర్కొన్నారు. గ్రామంలోని ఎనిమిది వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఇస్లావత్ రవి, వార్డు సభ్యులు బోళ్ళ శ్రీశైలం, కాకా రాఘవమ్మ, లావుడియా వీరన్న, తేజావత్ కుష్బీయా, గ్రామ పెద్దలు పాండవుల రామానాథం, బుర్ర వెంకన్న, రాము, ఉపేందర్, జక్కుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి ప్రజాప్రతినిధులే పాలనకు పునాదులు



ప్రజాపక్షం/బూర్గంపాడు: రవీంద్ర భారతిలో బొర్రా జ్ఞానేశ్వ ముదిరాజ్ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉప సర్పంచ్ సంఘం అధ్యక్షులు మహంకాళి రామారావును ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులే పాలనకు పునాదులని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్, ఉపసర్పంచ్‌ల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేస్తున్న ఉపసర్పంచ్‌లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మహంకాళి రామారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపసర్పంచ్‌ల హక్కుల గౌరవం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు విజయవంతం చేయాలి




ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాక భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయంలో బూర్గంపాడు మండల కార్యవర్గ సమావేశం పేరాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి పినపాక నియోజకవర్గం కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా)లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భవించి భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు 45 దేశాల ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని జనవరి మూడో తారీకు సాయంత్రం నాలుగు గంటలకు సారపాక సెంటర్‌లో ప్రచార జీప్ జాత చేరుకుంటుందన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి పాండవుల బిక్షం, మండల సీనియర్ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు, బొర్రా రాఘవులు, సిద్ధార్థ సుబ్బారెడ్డి, ఎండి సాజిద్, గాదే శ్రీను, దాసరి మల్సూరు, వంకాయలపాటి నాగేశ్వరరావు, మేకల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి ముత్యం రాజీనామా



ప్రజాపక్షం/గుండాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడెం ముత్యం చారి మండల అధ్యక్ష పదవికి రాజినామ చేస్తున్నట్లు మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో గత 25 సం.లుగా సామాన్య కార్యకర్త నుండి మండల అధ్యక్ష స్థాయికి ఎదిగి తన ఆర్థిక , వ్యక్తిగత కారనాల వలన మండల అధ్యక్ష పదవికి రాజీనామ చేస్తున్నట్లు వివరించారు. అధ్యక్ష పదవి ఇప్పించిన రాష్ట్రనాయకులకు , ఇంతకాలం పార్టీలో సహకరించిన కార్యకర్తలకు ధన్యవాదాలను తెలిపారు. నేటినుండి ఒక పార్టి సామాన్య కార్యకర్తగా కొనసాగుతానని తెలిపారు.

# జిల్లాలో 14,388 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు



**-ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి యూరియా పంపిణీ :కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 14,388 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 10,088 మెట్రిక్ టన్నుల స్టాక్ వచ్చిందని, జిల్లాలో 4,300 మెట్రిక్ టన్నుల స్టాక్ రిజర్వు ఉందని కలెక్టర్ తెలిపారు. యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేదన్నారు. మన జిల్లాలో ఇప్పటి వరకు రైతులకు 18,982 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో యూరియా బుకింగ్ యాప్ వచ్చే వరకు ఆఫ్‌లైన్ పద్ధతిలో రైతు పట్టాదారు పాసుపుస్తకం పరిశీలించి యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 82 ప్యాక్స్ కేంద్రాలు, 84 ప్రైవేటు డీలర్ల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో యూరియాకు ఎటువంటి కొరత లేదని ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ప్రతి కొనుగోలు కేంద్రం ద్వారా యూరియా అందిస్తున్నామని రైతులు ఆందోళన చెందకుండా అవసరమైన మేర మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని కలెక్టర్ తెలిపారు.

# ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు





**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయం భూ జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. జమలాపురం గ్రామానికి చెందిన ఖమ్మం కెవిఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి దంపతుల సహకారంతో స్వామి వారిని, అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, వేద పండితులు విజయ్‌కృష్ణ, చక్రధర్, దాతలు కోటేశ్వరరావు, నిర్మలకుమారి ఆధ్వర్యంలో ఉత్తర ద్వారం తెరిచి పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామి వారి గోవిందమాల ధరించి ఇరుముడితో వచ్చిన స్వాములకు ముందుగా దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ 24 ఏకాదశులలో ధనుర్మాసంలో వచ్చే ఏకాదశి అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని ముక్కోటి ఏకాదశి హిందువులకు ఎంతో పవిత్రమైందని ఈ రోజు స్వామి వారిని దర్శనం చేసుకుంటే ముక్కోటి దేవతలను దర్శనం చేసుకున్నంత పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో జగన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌కుమార్ తన సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అసమర్ధ పాలన

**మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు**



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం చింతకాని బారాస పార్టీ ఆధ్వర్యంలో యూరియా కొరత వల్ల ఎర్రబారిన మొక్కజొన్న పంటను చూపుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ రైతులకు యూరియా సరపడా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రికి పాలనపై పట్టు లేదన్నారు.కేసీఆర్ పాలనలో రైతులు వ్యవసాయాన్ని పండగలా చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో విత్తనాలు మొదలుకొని, పంటరుణాలు ఎరువుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.ముగ్గురు మంత్రులున్న జిల్లాలో రైతుల గోస పట్టటం లేదన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోమట్లగూడెం, తిరుమలాపురం సర్పంచులు కొమ్ము పరిశుద్ధరావు, చాపలమడుగు వీరబాబు, బారాస నాయకులు బొడ్డు వెంకటరామారావు, మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, వంకాయలపాటి సత్యనారాయణ, గద్దం శ్రీను, పొనుగోటి రత్నాకర్, బండి రామారావు, డీవీఆర్, షబ్బీర్ ఖాన్ పాల్గొన్నారు.

# తెలుగు మహాసభల ప్రచార పత్రికను విడుదల చేసిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రపంచ తెలుగు మహాసభల ప్రచార పత్రికను మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ విడుదల చేశారు. జనవరి మూడు, నాలుగు, ఐదు తేదీల్లో గజల్ శ్రీనివాస్ నేతృత్వంలో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరులో జరుగుతున్నాయి. ఈ మహాసభల ప్రచార కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను మేయర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే విధంగా మహాసభలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, సంస్థ బాధ్యులు బుక్కా సత్యనారాయణ, తిరునగరి శ్రీనివాసరావు, లక్ష్మీ నర్సింహచారి, కోంపల్లి రామయ్య, గుమ్మడి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నం ఫౌండేషన్‌లో దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముదిగొండ మండలం వనం వారి కిష్టాపురంకు చెందిన చేబ్రోలు శ్రీనివాసరావు శ్రీదేవి దంపతుల కుమారుడు చేబ్రోలు వీరతేజ నిఖిల వివాహ సందర్భంగా మంగళవారం అన్నం ఫౌండేషన్‌లో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు, చేబ్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గ్రేస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, బొమ్మలను పంపిణీ చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలోని జిపిఎస్ కూచవల్లాల్, జిపిఎస్ సంభాని నగర్, జిపిఎస్ పార్శీబంధం, జిపిఎస్ పాకబండ, ఎంపిపిఎస్ కొత్తూరు, అగ్రహారం, జగ్గయ్యమిల్లు, జెడ్పిహెచ్ఎస్ మల్లెమడుగు, ఎంవిపాలెం పాఠశాలల్లో విద్యార్థులకు క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా గ్రేస్ సొసైటీ ఆధ్వర్యంలో రగ్గులు, బొమ్మలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిఎస్ఎస్ వ్యవస్థాపకులు బిషప్ ఎం. జాకబ్ సేవా గుణాన్ని పలువురు హెచ్ఎంలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జీవన్, మురళీకృష్ణారెడ్డి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# కేఫ్ మజా రెస్టారెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేఫ్ మజా రెస్టారెంట్‌ను కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. మంగళవారం కేఫ్ మజా రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించి వారి మన్ననలను పొందాలని నిర్వాహకులను సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడవి మంటల నివారణపై అవగాహన



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** మండల పరిధిలోని గుబ్బగుర్తి, అంజనాపురం గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవి మంటల నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేసవి కాలంలో అడవుల్లో మంటలు చెలరేగడం వల్ల వృక్ష సంపద, వన్య ప్రాణులు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అడవుల్లో నిర్లక్ష్యంగా నిప్పుపెట్టడం, పశువుల మేత కోసం గడ్డి కాల్చడం, వంటల అనంతరం మంటలను పూర్తిగా ఆర్పకపోవడం వంటి కారణాల వల్ల అడవి మంటలు ఏర్పడుతున్నాయని వివరించారు. మంటలు కనిపించిన వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. అడవులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రజల సహకారంతోనే అటవి మంటలను నియంత్రించవచ్చునని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుబ్బగుర్తి అటవీ శాఖ సెక్షన్ ఎఫ్ఎస్‌వో జి. ఉపేంద్రయ్య, ఎఫ్‌బిఓలు విజయ, అయోధ్యమ్మ, ఖాజాబీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏకాదశి సందర్భంగా పూజలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏన్కూరు మండలం గార్ల వొడ్డు శ్రీలక్ష్మీ నర్సింహస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు హాయిగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సంప్రదాయ బద్ధంగా రాములునాయక్‌కి స్వాగతం పలికారు.

# డాక్టరేట్ పట్టా పొందిన గుదిమళ్ల వాసి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్లకు చెందిన రజియాబేగం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ విభాగంలో పిహెచ్‌డి పట్టా పొందారు. డిజైన్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మర్ లెస్ గ్రిడ్ కనెక్టెడ్ ఇన్వర్టర్ టోపోలజీ విత్ అడ్వాన్స్‌డ్ కంట్రోల్ స్ట్రాటజీ ఫర్ లీకేజీ కరెంట్ రీడక్షన్ అనే పరిశోధన గ్రంథాన్ని అసోసియేట్ ప్రో।। జే. ఉపేందర్ పర్యవేక్షణలో సమర్పించారు.ఈ సందర్భంగా రజియాబేగం మాట్లాడుతూ తన తల్లిదండ్రులు మహబూబ్ హుస్సేన్, జహార్ అబీ తన భర్త చేకూరి సుధాకర్ అందించిన ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించానని ఆమె తెలిపారు. రజియాబేగంను పలువురు అభినందించారు.

# శతాబ్ది ఉత్సవ ముగింపు సభను పండగలా జరుపుకొందాం

- ఇంటింటికి తరలిరావాలి
- జనవరి 3 నుండి 7వరకు ప్రచార జాతా
- ఐదులక్షల మందితో భారీ బహిరంగ సభ
- విజయవంతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకొంటాం







**ప్రజాపక్షం/పాల్వంచ :** ఖమ్మం కేంద్రంగా వచ్చే నెల 18న, జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పండగలా ఉత్సాహభరితంగా జరుపుకొందామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పాల్వంచ పట్టణ, మండల విస్తృత కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సంధర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ భారీ బహిరంగ సభకు పార్టీ ప్రధాన కార్యదర్శి రాజాతో పాటుగా సుమారు 14 దేశాల నుండి ప్రతినిధులు, కవులు, కళాకారులు, మేదావులు తరలివస్తున్నారని చెప్పారు. మూడు వేయిల మంది రెడ్ షర్ట్ వాలంటీర్లును సిద్ధం చేశామన్నారు. దీనితో ఖమ్మం పట్టణం అరుణవర్ణం కాబోతున్నదని అందులో పాల్వంచ భాగం కావాలని సూచించారు. అందుకు పాల్వంచ పట్టణ, మండల వ్యాప్తంగా భారీ ఎత్తున కదిలిరావాలని కోరారు. భారత గడ్డపై సిపిఐ వందేండ్ల చరిత్ర కలిగిన పార్టీలో సభ్యులుగా ఉండటం మనకు గర్వకారణమన్నారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు, మేదావులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నీతివంతమైన పాలన సాగించాలి : ఖమ్మం వేదికగా వచ్చే నెల 18వ, తేదీన జరిగే సిపిఐ శతాద్ధి ఉత్సవ ముగింపు సభకు భారీ ఎత్తున కదిలి వచ్చి విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాలలో నీతి వంతమైన పాలన అందించాలన్నారు. ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో అభివృద్ధిలో భాగం పంచుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో రాబోయే కార్పోరేషన్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను ఎదుర్కొని విజయబాహుటా ఎగురవేద్దామని అన్నారు. సన్మానం : అనంతరం సిపిఐ చెందిన 15 మంది సర్పంచ్‌లు, తొమ్మిది మంది ఉప సర్పంచ్‌లను, 94 మంది వార్డు సభ్యులను, పోటీ చేసి ఓటమి చెందిన సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి విశ్వేశ్వర్ రావు, వి. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, వరక అజిత్, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, డి. చెన్నయ్య, కోరె క్రిష్ణ, కాసర్ల రామారావు, శెట్టి చేరాలు, ఎస్ఏ. రహమాన్, వల్లపు యాకయ్య, జకరయ్య, బివి. సత్యనారాయణ, తంతెనపల్లి వెంకన్న,నాలా మల్లేష్, బాబూరావు, జి. రవి, వేములపల్లి శ్రీనివాసరావు, చిల్ల క్రిష్ణ, ఉంద్రాతి రవి, ఆవుల సతీష్, కోటి తిరుపతయ్య, వేములపల్లి రాజశేఖర్, బానోత్ రంజిత్, జర్పుల మోహన్, మాలోత్ హరి, తెజావత్ వినోద్, చంచలపురి శ్రీను, నిట్టా అమృతరావు, చందూలాల్, బిక్కూలాల్, సిపిఐ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యం పెంపుతో పదోన్నతులు సాధించాలి

**మణుగూరు ఏరియా ఎస్ ఓ టు జి ఎం జిఎం బి శ్రీనివాసచారి**



**ప్రజాపక్షం/మణుగూరుః** మేనేజ్మెంట్ ట్రైనీ (మైనింగ్), జెఎంఈటి అంతర్గత అభ్యర్థులకు అర్హత పరీక్షలువృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవడం ద్వారా పదోన్నతులు సాధించుకోవాలనీ తద్వారా ఉద్యోగోన్నతి సులభతరం అవుతుందని మణుగూరు ఏరియా ఎస్ ఓ టు జిఎం బి శ్రీనివాసచారి అన్నారు. మంగళవారం మణుగూరు ఏరియా ఎంవీటీసీలో జరిగిన మేనేజ్మెంట్ ట్రైనీ(మైనింగ్), జెఎంఈటి అంతర్గత అభ్యర్థులకు పేస్ 2 వ్రాత పరీక్ష మరియు మౌఖిక అర్హత పరీక్షలకు ఆయన మరియు ఏరియా అధికార ప్రతినిధి డీజిఎం పర్సనల్‌సలగల రమేష్ నిర్వాహకులుగా మరియు పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హత పరీక్షలలో ఉత్తీర్ణులైన మేనేజ్మెంట్ ట్రైనీ అభ్యర్థులకు అండర్ మేనేజర్ అర్హత ధ్రువీకరణ పత్రం (సర్టిఫికెట్) జె ఎం ఈ టి అభ్యర్థులకు ఓవర్ మెన్, మరియు మైనింగ్ సర్దార్ సర్టిఫికెట్ పొందుటకు అర్హులని వారు తెలిపారు. సర్టిఫికెట్స్ సంబంధిత అభ్యర్థులకు ఉద్యోగోన్నతిలో ఎంతగానో ఉపయోగపడతాయని వారు తెలిపారు. వ్రాత పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను వారు అభినందించారు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు దుప్పట్లు, హైజినిక్ కిట్లు, టాయ్స్ పంపిణీ




**ప్రజాపక్షం/మణుగూరుః** గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మణుగూరులోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో 1000 మంది విద్యార్థిని విద్యార్థులకు దుప్పట్లు, హైజినిక్ కిట్లు, టాయ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీమతి జి స్వర్ణ జ్యోతి, సమితి సింగారం గ్రామ సర్పంచ్ కలబోయిన మాధవరావు, అలాగే ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, స్కూల్ హెచ్ఎం జి నాగశ్రీ పాల్గొని వారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటీ వారు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడము విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో శుభ పరిణామం అని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేసి భావి భారత పౌరులను తయారు చేసే విద్యాలయాలకు చేయూతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విధానాన్ని బట్టి వారి సేవలను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటున్నాను అలాగే నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచ్ కలబోయిన మాధవరావు మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటీ సేవలు ఎంతో కాలంగా మేము చూస్తున్నాము మాటల్లో కాక చేతుల్లో వారి కార్యక్రమాలు ఉంటున్నాయని వారితో పాటు మేము కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతామని తెలియజేశారు. ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటీ తో నాకు చాలా కాలం నుండి మంచి అవినాభావ సంబంధాలు కలిగి ఉన్నామని ఈ మంచి సేవా కార్యక్రమాల్లో నన్ను భాగస్వామిగా చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ మణుగూరు బ్రాంచ్ ఇంచార్జ్ పుల్లారావు, హరీష్ మల్లేశ్వరరావు మైపా సురేష్ స్కూల్ సిబ్బంది వార్డ్ మెంబర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పెనుబల్లి తహసిల్దార్, జిపిఓలపై సస్పెన్షన్ వేటు

**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి మండల తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్, చింతగూడెం జిపిఓ బి. రవి లపై సస్పెన్షన్ వేడుపడింది. మండలం చింతగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 71/4 లోని 1.20 కుంటలు ప్రభుత్వ సీలింగ్ భూమిని జిపిఓ రవి ఇచ్చిన నివేదికను పరిశీలించకుండా ఇతరులకు డిజిటల్ సైన్ ని జివన్ చేసి పై అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా ప్రభుత్వ భూమిని ఇతరులకు దారదత్తం చేసి నిర్లక్ష్యం చేశారని అట్టి విషయంపై విచారణ చేసిన అధికారులు జిల్లా కలెక్టర్ కి నివేదిక పంపించారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్, జిపిఓ బి రవి లను ఆరు నెలలు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలని జూలూరుపాడు సబ్ ఇన్స్పెక్టర్ బాదావత్ రవి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలని, పోలీసు వారి సూచనలు పాటించాలని అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు నిర్వహించుకునే వారు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేడుకలు జరుపుకునే వారు కుటుంబంతో కలిసి ఇంట్లోనే ఉత్సవాలు జరుపుకోవడం మంచిదని, ప్రమాదకరంగా ఉత్సవాలు జరుపుకోవద్దన్నారు. అంక్షలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు.

# వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పలు దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం ను దర్శించుకున్నారు. మండల కేంద్రంలో రామదాసు మందిరంలో ఉత్సవం ను ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయాలలు భక్తులతో కిటకిటలాడారు. మండలం లోని మంగాపురతండా లో జరిగిన ఏకాదశి వేడుకలలో సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి దంపతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్య సోసైటీ ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, ఉప సర్పంచ్ నాగరాజు, సోసైటీ మాజీ అధ్యక్షుడు ధీరావత్ బాలాజీ, గోబ్రియానాయక్ తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరపురం దేవాలయంలో జరిగిన వేడుకలలో సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, బొనగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ గెలిచే మొక్కులు చెల్లింపులు




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సర్పంచ్ గెలిస్తే... మొక్కులు చెల్లించుకుంటామని స్థానిక కాంగ్రెస్ నాయకులు మొక్కుకున్నారు. విజయం సాధించటంతో మంగళవారం ఆ మొక్కులు చెల్లించుకున్నారు. మండలం లోని కోరట్లగూడెం లో కాంగ్రెస్ అభ్యర్థి కొత్తపల్లి త్రివేణి సర్పంచ్ గా గెలిపిస్తే తాము 101 కొబ్బరికాయలు కొడతామని స్థానిక నాయకులు బచ్చలకూరి నాగరాజు స్థానిక శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం లో మొక్కుకున్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు అనుకున్నట్లుగా మొక్కులు చెల్లించారు. స్వామి వారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి త్రివేణి, కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, కొత్తపల్లి, సబ్బయ్య, బాజా శ్రీనివాసరావు, షేక్ మైబు, సైదా, నజీర్, లాలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా గడపండి



**ప్రజాపక్షం/మణుగూరుః** సబ్ డివిజన్ డిసెంబర్ 31 రోజున విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, నూతన సంవత్సర వేడుకలు నేపథ్యంలో డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్సులు, వినియోగిస్తే ఉపేక్షించేది లేదని, మైనర్లు వాహనాలు నడిపి పట్టుపడితే వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు లు తెలిపారు.

# వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ తనిఖీ



**ప్రజాపక్షం/పెనుబల్లిః** కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ మంగళవారం వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కల్లూరు సబ్ డివిజన్ ను నేర రహిత డివిజన్ గా చేస్తామని అన్నారు. ప్రతి మండలంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వేరువేరు సమస్యలను గుర్తించినట్లు ఆమె తెలిపారు. పెనుబల్లి మండలంలో ముఖ్యంగా గంజాయి వినియోగం ప్రధాన సమస్యగా గుర్తించామని తెలిపారు. గంజాయి మత్తుకి బానిసలై యువత భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. గంజాయి సమస్య నిర్మూలనకు గంజాయి సరఫరా చేసేవారిని, గంజాయి సేవించే వారిని గుర్తించి అట్టి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి భద్రతకై ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఏసీపీ వసుంధర తెలిపారు.

# రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా ఏదులాపురం మున్సిపాలిటీ



- ప్రజా ప్రభుత్వంలో ప్రజల కోర్కెలన్నీ తీర్చుతాం
- సీఎం రేవంత్‌రెడ్డి దక్షతతో అభివృద్ధి
- మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** తెలంగాణ రాష్ట్రంలోనే రోల్‌మోడల్గా ఏదులాపురంమున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీలో ముమ్మరంగా పర్యటించారు. శ్రీరాంనగర్, సాయిగణేష్‌నగర్‌లో కల్వర్టు, పోలేపల్లిడబుల్‌బెడ్‌రూం కాలనీలో సీసీరోడ్లు,డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వంలో ప్రజలు కోరుకున్న కోర్కెలన్ని తీరుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దక్షతతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు జోడెద్దుల గుర్రాంల పరుగెడుతున్నాయన్నారు. ఏదులాపురంమున్సిపాలిటీ అభివృద్ధికి గత 2 సంవత్సరాల కాలంలో రూ.221కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటితో సీసీరోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టులతో పాటు పలు అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. అలాగే మున్సిపాలిటీలో అవసరమైన రోడ్లు, డ్రెయిన్లు, త్రాగునీటి సరఫరాతో ఇతర సౌకర్య పనులను పూర్తి చేస్తామన్నారు. ప్రజా సంక్షేమమే, ఎజెండాగా ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్‌కార్డుల జారీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమాలు అమలు చేస్తున్నామన్నారు. పేదల ఆత్మగౌరవంగా భావించే సొంతింటి కలను నెరవేరుస్తూ రెండవ విడత ఇండ్ల మంజూరు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీఓ నర్సింహారావు, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఎంపిడీఓ రవికుమార్, ఏసీపీ తిరుపతి రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, భూక్య సురేష్ నాయక్, సిపిఐ మండల నాయకులు తోట వీరభద్రం, వెంపటి రవి, కందుకూరి వెంకట నారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్ పాల్గొన్నారు.

# సిపిఐ ఉద్యమ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- జనవరి 18న సిపిఐ శత వసంత ముగింపు ఉత్సవాలు
- ప్రతీ కమ్యూనిస్టు కుటుంబం పాల్గొంచుకోవాలి
- జనవరి 3 నుండి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతా
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ వందేళ్ల ఉద్యమ చరిత్ర, త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం, శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన పట్టణ విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు వందేళ్ల చరిత్ర, కార్మిక,కర్షక, పేద ప్రజల పోరాటాలతో ముడిపడి ఉందన్నారు. జనవరి 18వ తేదిన ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల బహిరంగ సభకు జిల్లా నలు మూలల నుండి భారీగా తరలిరావాలని కోరారు. ప్రతీ కమ్యూనిస్టు కుటుంబం ఈ చారిత్రక ఉత్సవాల్లో తప్పకుండా పాల్గొంచుకోవాలన్నారు. శత వసంత ఉత్సవాల ప్రచారంలో భాగంగా ఈనెల 3వ తేది నుండి 7వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3వ తేదిన భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని చర్ల మండల కేంద్రం నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతా 7వ తేదిన సుజాతనగర్ మండల కేంద్రంలో ముగుస్తుందన్నారు. ఈ జాత ద్వారా సిపిఐ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టు భావాజాలం మరింత అవసరమని, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. పార్టీ శ్రేణులు ఐఖ్యంగా పనిచేసి వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, ఎస్‌కే ఫహీమ్, పట్టణ నాయకులు నేరెళ్ల రమేష్, గొనె మణి, విజయలక్ష్మి , వంగ వెంకట్, గడ్డం రాజయ్య, ఎండి యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, గోపి కృష్ణ, నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, గుత్తుల శ్రీనివాస్, పి.సత్యనారాయణ చారి, తూముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలి




- ప్రజల దరఖాస్తులను అనవసరంగా తిరస్కరించవద్దు
- ప్రభుత్వ భూముల ఆక్రమణపై సమగ్ర నివేదిక అందించాలి
- భూ సర్వే పనులపై సమీక్షించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిబంధనల ప్రకారం సర్వే పనులను జనవరి 15 వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి భూ సర్వే పనులపై మంగళవారం మండలాల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ పూర్తి చేయడంలో సర్వే శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులన్ని సర్వే సరిగ్గా చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మండలాల వారీగా సర్వేయర్ పనితీరుపై సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి రెగ్యులర్‌గా రివ్యూ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందించిన దరఖాస్తులలో అధికంగా తిరస్కరించడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు దరఖాస్తులను తిరస్కరించే సమయంలో తప్పనిసరిగా కారణాలు ఉండాలని లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సర్వేకు సంబంధించి మండలాలకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. చిన్న చిన్న కారణాలకు ప్రజలు అందించిన దరఖాస్తులను తిరస్కరించడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సర్వే పనులు జనవరి 15 వరకు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం భూ భారతిలో ఉన్న ప్రభుత్వ భూమి ఫీల్డ్ పోజిషన్ డి మార్క్ చేసి ఎంత అందుబాటులో ఉందో వివరాలు కూడా సమర్పించాలన్నారు. ప్రతి మండలంలో ప్రభుత్వ భూమి అధికంగా ఉన్న ఐదు సర్వే నెంబర్లను తీసుకుని డి మార్క్ చేసి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి పరిధి, విస్తీర్ణం, ఆక్రమణకు గురైన భూమి వంటి వివరాలతో జనవరి లోగా సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడి శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎసిపి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు పోలీస్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఏసిపి వసుంధర యాదవ్ సందర్శించి పలు సలహాలు సూచనలు చేశారు. స్టేషన్ నిర్వహణ పోలీసుల పనితీరు విచారణ నివేదికలు సిసిటిఎన్ఎస్ అప్లోడ్ జనరల్ డైలీ రికార్డులను సీజ్ చేసిన వాహనాలు వివరాలు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. నేరాలు నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, రౌడీషీటర్ల ప్రవర్తన నియమాలు పై గ్రామాలలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పి ఉండాలని నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని సిసిటీవీ కెమెరాలో ఏర్పాటుపై ప్రజలలో ప్రత్యేక అవగాహన కల్పించాలని పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు అండర్ డైల్ కాల్స్ ప్రతిస్పందన సమయం పెండింగ్ కేసులు పరిశీలించాలని విధిగా ప్రత్యేక దృష్టి సారించాలని, అదేవిధంగా వాహనాలు తనిఖీలు ముమ్మరం చేయాలని, పాత నేరస్తుల కదలికలను మెగాపెట్టాలని సంబంధిత సిఐ ముత్తిలింగం ఎస్సై హరితలకు వారితో పాటు సిబ్బందికి తెలిపారు. ఈ సందర్భంగా రికార్డులు గదులను పరిశీలించారు.

# పాఠశాలకు ఆర్థికసాయం




**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు గ్రామ పెద్దలు వల్లభనేని భద్రయ్య మనవరాలు చైతన్య లక్ష్మి రూ 25,000 హార్దిక సహాయం పాఠశాల అభివృద్ధికి అందించారు. అమెరికాలో ఉంటూ సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తూ జన్మస్థలమైన గ్రామం అభిమానంతో ప్రతి సంవత్సరం 25,000 పాఠశాల అభివృద్ధికి విద్యార్థులను విద్యలో ప్రోత్సహించడానికి వితరణ చేశారు. చైతన్య లక్ష్మి సేవా గుణాన్ని మెచ్చి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు సాఫ్ట్వేర్ ఇంజనీర్ ను అభినందించారు.

# కంకర పరిచారు... తారు మరిచారు..



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి వెన్నవల్లి మధ్య మూడు కిలోమీటర్ల మేర గ్రీన్ఫిల్డ్ హైవే వాహనాలు తిరిగి రాకపోకలకు ధ్వంసం కావడంతో వారు గత రెండు సంవత్సరాల నుంచి ఈ రహదారిపై రాకపోకలు గుట్ట నుంచి మట్టి తోలకాలతో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మట్టితోలకాలు చేశారు. దీని వలన రహదారి ధ్వంసం కావడంతో వారు తారు పోపించడానికి కంకర పరిచారు. కానీ రెండు నెలలైనా బిటి పోపించడం లేనందున ఆంధ్ర తెలంగాణ రహదారి అయినందున నిరంతరం ప్రతిరోజు రాకపోకలు వాహనాలు రెండు మూడు నాలుగు చక్రాల వాహనాలు దారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ఒళ్ళు ఓనమైతుంది. దీనివలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరగా ఆర్ అండ్ బి శాఖ తరపున ప్రతిపాదనలు పంపించామని, గ్రీన్ ఫీల్డ్ హైవే వారు పోసేది పోయింది మాకు తెలియదని ఆర్ అండ్ బి జేఈ రవిచంద్ర తెలిపారు.

# రైతులు ఆందోళన చెందనవసరం లేదు

## మండల వ్యవసాయ అధికారిని యం.రాధ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** యూరియా కోసం రైతులు ఆందోళన చెందనవసరం లేదని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ అన్నారు. మండలంలోని వివిధ సోసైటీలలో మంగళవారం పంపిణీ చేసిన యూరియాను పరిశీలించారు. మం డల కేంద్రంలో గ్రోమోర్ వద్ద రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉన్న వారికి పంపిణీ చేయాలని నిర్వహాకులను ఆదేశించారు. ఆమె స్వయంగా రైతుల వద్ద నుంచి జీరాక్స్ లను సేకరించి వీరందరికి ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలం మంగళవారం 9 కేంద్రాలలో 2,600 యూరియా కట్టలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని రైతాంగం కు యూరియా కోరత లేకుండా ఉండేందుకు మరో 250 మెట్రిక్ టన్నుల యూరియా కోసం "ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా వరసక్రమంలో తీసుకోవాలని సూచించారు. యాఫ్ సాంకేతిక వలన నిలిచిపోవటంతో రైతులకు ఇబ్బందులు లేకుండా పాత పద్ధతి లో పంపిణీ చేసే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం నేలకొండపల్లి సోసైటీలో 400 యూరియా బస్తాలు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. పంపిణీ వలన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారులు తదితరులు పాల్గొన్నారు.